

శ్రీపతి

శ్రీ 'ఆ చింతచెట్టుకింద లెఫ్టుకి తీసావు' అన్నాడు క్లీనర్ నర్సిములు. పద్దెనిమిదేళ్ళ వాడి గొంతు లారీ ఇంజన్ మోతలో వెల్డింగ్ ధ్వనిలాగ మోగింది.

బ్రేక్‌మీద పాదాన్ని నొక్కి 'ఏవీ ఎక్కడ —ఒక్క ... కొడుకూ కనబడ్డు' ఎవరూ కనిపించక పోయేసరికి విసుక్కున్నాడు లారీ లైట్‌లో కనిపించినంత మేరా వెతికి సిమ్హాద్రి.

కొబ్బరికాయలు లోడ్ ఎక్కించుకు పోవడానికి వచ్చింది లారీ. సిమ్హాద్రికి ఈ రూట్ కొత్త. నర్సిములు ఆపమన్న దగ్గర కొబ్బరికాయల రాశి కనిపించలేదు. లోడ్ చేసే లేబరూ లేదు. దారితప్పి ఈ ఊరు చేరామేమో అనిపించింది.

'హార్న్ కొట్టు' అని నర్సిములు చెప్ప టమూ, చెవులు గింగుర్లెత్తి పోయేట్టు సిమ్హాద్రి హార్న్ కొట్టడమూ ఒకేమారు జరిగాయి. చీకటి. ఊరు ఎక్కడుందో ఏమిటో. మనుషుల అలికిడి ఏమీ లేదు. దానికితోడు అప్పుడే నక్కలు ఒకటి తర్వాత ఒకటి ఊళలు అందుకున్నాయి. అడవుల్లో కొండల్లో ఏజెన్సీ ఏరియా అంతటా అటు పాలూరు లైన్‌లో ఏళ్ళ తరబడి తిరిగినా భయం లేకపోయింది కాని ఈ నక్కలు ఊళలకి గుండె కొట్టుకున్నది. మనిషి చచ్చిపోయినప్పుడు చుట్టూ ఉన్న బంధువులు గొల్లున ఏడిచినట్లనిపించింది.

'ఇక్కడ ఈ వూళ్ళోనేనా లోడింగు?'

నర్సిములు ఈ రూట్‌న గత రెండేళ్ళ నించి తిరుగుతున్నాడు. మానేజర్ చెప్పినంత మట్టుకు ఇదే ఊరని గుర్తు.

'ఇంజి నాపు' అని నర్సిములు కిందికి దూకాడు.

శ్రీకాకుళం నించి డెబ్భయి మైళ్ళు వచ్చి సోంపేటలో ఎరువుల బస్తాలు దించి మరో పదిమైళ్ళు పరుగెత్తి చివరికి ఈ చింతకింద ఆగింది లారీ. ఇక్కడ లోడింగ్ అయిపోయినాకా మరోగంటలో మళ్ళీ సుమారు ఎనభై మైళ్ళు పరుగెత్తాలి.

సిమ్హాద్రి బీడీ తీసి అగ్గిపుల్ల గీసి వెలిగించాడు. నోటినిండా పొగపీల్చిమింగాడు. నెలదినాలుగా పెరిగిన గెడ్డాన్ని గోక్కున్నాడు. ముఖంమీది చెమట్ని తుడుచుకుని నుదురుమీద పడుతున్న జుత్తుని వేళ్ళతో వెనక్కి దువ్వుకున్నాడు.

'చంద్రన్నా చంద్రన్నా'

లారీ హార్న్‌కంటే తన గొంతే నయమన్నట్టు అరచి పిలిచాడు నర్సిములు.

సీట్‌నించి దిగకుండా చూస్తున్నాడు సిమ్హాద్రి.

అంతకుముందు పడిన వానకి చెట్ల ఆకుల వాసన రేగింది. దానికి రాత్రిపూల వాసనలు తోడయ్యాయి. వాటితో గాలి చిక్కబడి మత్తెక్కిస్తున్నది. కీచురాళ్ళు తడిసినందుకు చస్తున్నట్టు అరుస్తున్నాయి. ఆకాశాన్ని చుక్కల్ని కప్పేస్తున్నాయి కొబ్బరితోటలు.

'ఇది వూరా అడివా ?' మళ్ళీ విసుక్కున్నాడు సిమ్హాద్రి.

ఆ బండిలో సిమ్హాద్రితో రావడం నర్సిములుకి ఇష్టం లేదు. పోలీస్ ఆఫీసర్ ఎవరో ప్రొప్రయిటర్ స్నేహితుడు బదిలీ అయిన సందర్భంలో నర్సిములు లారీ ఆ లగేజ్‌లో అటు రాజమండ్రి వెళ్ళింది. సిమ్హాద్రికి ఈ రూట్ కొత్తని నర్సిములుని ఈ బండికి పంపించాడు మేనేజరు.

సిహామ్మద్రి అంటే స్టాఫ్‌లోపడదు. అందరి దగ్గరా అప్పులు చేస్తాడు. తీర్చడు. మందితో కలవడు ఏ చందాలూ ఇవ్వడు ఎప్పుడూ నవ్వడు. షెడ్‌లోకి వస్తే మెకానిక్‌తో పోట్లాట. ఆఫీస్‌లో గుమస్తాని తన్నబోయాడు ఆర్నెల్ల కిందట వేరే కంపెనీ డ్రయివర్‌ని చితకతన్నాడు. వీటన్నిటి వలన సిమ్మాద్రి అంటే నర్సిములుకి ఓ పక్క భయంకూడా.

'ఎల్లు వాళ్లో కెళ్లి ఏమయిందో చూడు' అన్నాడు సిమ్మాద్రి.


నర్సిములు ఊరువేపు నడిచాడు.

తొందర పడుతున్నాడు సిమ్మాద్రి. లోడింగ్ ఎంత తొందరగా అయిపోతే అంత తొందరగా పోవచ్చు. మూడుగంటల్లో బండిని గోడౌన్స్‌దగ్గర వొదిలేయొచ్చు. ఇంట్లో చావుగడియల్లో ఉంది నీలమ్మ. ఎవ్వరూ తోడు లేరు ఇరుగూ పొరుగూ ఉన్నా లేనట్టే.

నీలమ్మ మతిపడ్డప్పుడల్లా గుండె రంపపుకోత పెట్టుంది. చేజేతులా చంపేస్తున్నాడు చచ్చిపోతున్నది. ఇంక బతకదు. తను వెళ్లేసరికే ప్రాణం విడిచి ఉంటుంది. రెండువారాల క్రితమే డాక్టరు ఒకటి రెండు రోజుల మనిషి. లాభంలేదు అన్నాడు. ఏ రోజు కారోజే చచ్చిపోతుం దనుకున్నాడు. కాని ఇంక బతకదు తొందరగా వెళ్లాలి తను ఇప్పుడంటే ఇప్పుడు అక్కడుండాలి. అనుకోకుండా ఇంజిన్ స్టార్ట్ చేసాడు తెలివి తెచ్చుకుని ఆపాడు. మళ్లీ హార్న్ కొట్టాడు. నర్సిములు ఊరు చేరాడో లేదో ఆ ఊరు ఎక్కడుందో. ఎవరూ కనబడరు. ఈ రాత్రి లోడింగ్ ఉండదా కొంపతీసి. భయంగా ఉంది ఆ ఊహ. ఇలాంటి పాడు ఊహలు వస్తాయి కొన్నిసార్లు. అవి నిజమూ అవులాయి. లోడింగ్ కాదా ఇప్పుడు. టయిం ఇంకా ఎనిమిదికాదు. అంతా రడీగా ఉంటే అరగంట పని పన్నెండుకల్లా ఇల్లు చేరిపోయేవాడు. గొంతు తడి ఆరిపోతున్న దన్నా నీళ్లు అందించేవాళ్లు లేరు ఇంట్లో. డ్యూటీకి రాకపోతే మేనేజర్ తిడతాడు. బత్తా దొరకదు. బీడిముక్కకీ టీ నీళ్లకీ దిక్కు ఉండదు

లారీ లైట్ తీసేసాడు. సీటుదగ్గరి లైట్ కూడా. స్మశానంలో ఉన్నట్టుంది. అన్నీ రాకూడని ఊహలు. నీలమ్మ పాడిని ఎవరో వెనక మోసుకొస్తున్నట్టు కొత్త కుండలో నిప్పులు పట్టుకుని తను ముందు నడుస్తున్నట్టు. చితి కాలుతున్నట్టు. నెత్తురు మరిగి చర్మం పేలుతున్నట్టు. దాని పెద్ద జుత్తు కాలిపోతున్నట్టు.

ఆ ఊహాలో మోటారు టైరులాంటి సిమ్మాద్రి కూచున్నదగ్గరే నీరు నీరయిపోయాడు. వాడి కళ్లల్లో కన్నీళ్లు తిరిగాయి. ముక్కు తడయింది. గొంతులోకి దుఃఖమొచ్చింది. దేముడా దేముడా అన్నాడు.



స్వామి నీవు తప్ప దిక్కెవ్వరూ లేరు అని పదే పదే అనుకున్నాడు. పెళ్లాన్ని కాపాడమని మొక్కుకున్నాడు.

ఎవర్నో ఒకణ్ని తీసుకుని నర్సిములు వస్తున్నాడు. బయటికి తలపెట్టి 'లోడ్ లేదా?' అన్నాడు. లేకుండా ఉంటే ఇప్పుడే బండి తిప్పేస్తాడు. లోడ్ లేకుండా పోవాలి. దేవుడు వరమిచ్చినంత. చాలా బాగుండును

'లోడ్ వాళ్లో పల ఉంది. నక్క లైట్లేటి' అన్నాడు నర్సిములు.

'కమూనిష్టోళ్ల బయము. రోడ్డు కి వొద్దన్నాడు పెసిరెంటు' అని నర్సిములుతో వచ్చినవాడు కొత్త డ్రయివర్‌ని చూసి 'ఇయ్యాళ దరమన్న రాలేదా?' అని అడిగాడు నర్సిముల్ని.

సిమ్మాద్రికి చిరాకయింది. లారీ వచ్చి లోడ్ చేసుకుని పోయేదానికి కమ్యూనిష్టులు ఏం చేస్తారు. దీనికోసం బండిని ఊళ్లోకి తీసుకెళ్లాలి. ఆ చిరాకుతోనే 'కమ్యూనిష్టోళ్లు కొబ్బరి తోటలెత్తుకు పోరూ?' అన్నాడు.

'ఏమో ఎవుడికి తెల్సు? ఆళు అన్నీ తీసుకుంతా రంతన్నారు'

ఫకాలున నవ్వాడు నర్సిములు.

'అదికాదు నర్సింగులూ ఆళ్లు ఆగా బాగ్గెమంతుల డబ్బూ దనమూ బంగారమూ ఒకటేమిటి అంతా తీసుకుంటున్నారు. మొన్నేమయింది ఎరికా—

ఆ బోరింకలో ఆ ఇంటిలోన ఒక్క బియ్యంగింజ మిగల్సలేదంటే నమ్ముతావా?' అన్నాడు మళ్లీ అమాయికంగా,

నర్సిములు బండెక్కి 'సరిసరి. మాటలు తర్వాత. రా.' అని వాడినికూడా ఎక్కించుకుని 'ఊళ్లోకి పద' అన్నాడు డ్రయివర్‌తో.

బీడీముక్క పారేసి ఇంజన్ స్టార్ట్ చేసాడు సిమ్మాద్రి.

ఊళ్లోకి వెళ్లే రోడ్డు బాగా లేదు. అంతా ఇసిక పైగా పెద్ద డౌను. తర్వాత పెద్ద అప్పు. సన్నటి రోడ్డు ఊరు దగ్గరవుతున్నకొద్దీ కంపు.

రైటుకి కొయ్యి. లెఫ్టుకి కొయ్యి. అని చెప్తూ తిన్నగా మండంపం దగ్గర ఆపించాడు నర్సిములు. దగ్గర్లోనే కిందటి గాలివానకి సగం వొరిగిన స్కూల్ బిల్డింగ్ ఆ వరండాలో పోలీసులు. వాళ్లదగ్గర తుపాకులు. కొందరు యూనిఫారమ్‌లో, ఇంకొందరు సివిలియన్ డ్రెస్‌లో. వంట చేసుకుంటున్నట్టుంది. ఆ స్కూల్ దగ్గర్లోనే తూర్పు పక్క కొబ్బరికాయల రాశి. వానకి తడవకుండా కమ్మలు కప్పారు.

'చంద్రన్నా లోడింగ్ అరగంటలో అయిపోవాలి తెల్సిందా. తినకుండా వచ్చినాము, లేటయిపోతుందని. తొందరగా వెళ్తే పోంపేటలో—' అన్నాడు నర్సిములు బండి దిగుతూనే.

# తీర్పు

కూలీలని తీసుకు రావటానికి చంద్రన్న వెళ్లాడు.

మండపం దగ్గర పది పదిహేనుగురు జనం పోగయ్యారు. అక్కడ తీగెకి పెట్రోమాక్స్‌లైట్ వేలాడుతున్నది. తిళ్లు అయిన తర్వాత సభ ఉందట. నక్సలైట్ల మీదికి ఎదురు తిరగడం ఎట్లాగో పెద్ద మనుషులు, ప్రశిడెంటు చెపుతారట.

సిమ్మాద్రి లారీ సీట్‌నించి కిందికి దిగలేదు. మరొక బీడీ వెలిగించాడు. అటు పార్వతీపురం పాలకొండ పాతపట్నం ఆ ఏజెన్సీవేపు మాత్రమే పోలీసు లున్నారు అనుకున్నాడు గాని ఈ మారుమూల ఊళ్లల్లోసైతం పోలీసులు ఉంటారనుకోలేదు. అక్కడికి పదిమైళ్ల దూరంలో ఎక్కడా కొండల్లేవు. అడవులూ లేవు. మరేమో కమ్యూనిష్టులు కొబ్బరికాయలెత్తుకు పోతారని వాటని ఊళ్లో వేయించారు.


అమ్మా అక్కాచేసి బూతులు తిట్టున్నాడు సిమ్మాద్రి. తనని ఈ రూట్‌కు పంపినందుకు మేనేజర్ని తిట్టాడు. ఎరువులు అన్‌లోడ్ చేస్తుంటే వర్షం పట్టుకుంది. అందుకు వర్షాన్ని తిట్టాడు. ఇక్కడికి వచ్చేసరికి రోడ్డు మీద కాకుండా కాయ ఊళ్లో వేయించాడు ప్రశిడెంటు. అందుకు ప్రశిడెంట్‌ని తిట్టాడు. మీటింగ్ జరుగుతున్నదని చప్పుడు చేయొద్దని లోడ్ చేస్తున్న కూలీలని తిట్టి పని ఆపించాడు ఓ పెద్దమనిషి. ఆ పెద్దమనిషిని తిట్టాడు. ఆ మీటింగుని రెండు గంటలు సాగదీసారు గ్రామపెద్దలు. వాళ్లని తిట్టున్నాడు. నేలమీద కొబ్బరి కమ్మమీద కూచుని ఆ తిట్లన్నీ వింటున్నాడు నర్సిములు. ఎవళ్లెవళ్లనో తిట్టున్నా ఆ తిట్లన్నీ తనకే తగులుతున్నట్టున్నాయి నర్సిములుకి.

'నా పెళ్లాం చచ్చి పడుంటుందిరా అక్కడ. దానిశవాన్ని ఏ కుక్కో ఈడ్చుకు పోకుండా కాపలా కాయడానికన్నా ఈ రాత్రికి అక్కడి కెళ్లాలి. నర్సిములూ లోడింగ్ చేయించు. చంద్రన్నా — ఇప్పుడన్నా లోడింగ్ చేయించు. వెళ్లాలి బేగి—'అని సగం ఏడుపు గొంతులోనూ సగం ఉక్రోషం తోనూ వొత్తి చెప్పాడు సిమ్మాద్రి.

'ఏం సెయ్యను డయివేరు బాబూ పెద్ద మనుషులంతా నీ ఎదటే తిట్నారు సూసినావు కదా. మాకు పని సెయ్యాలని లేదా కూలి పైసలు మాకు సేదా?'

ఆ రోడ్డుమీదే కాయలు వెయ్యించి ఉంటే ఇంత కాకపోయేది.

ఆ ఊళ్లో పెద్ద భూస్వాములకు నక్సలైట్లు నోటీసు లిచ్చారు. ఎప్పుడు ఏరాత్రి వచ్చిపడతారో తెలీదు. పోలీసులు వచ్చి కాపలా ఉన్నా గ్రామస్థులు సాయ పడితేనేగాని వాళ్లు ఏం చేయలేరు. వూళ్లో నాలుగయిదు కుటుంబాలు తప్పించి మిగిలినవాళ్లు పట్టించుకోవడం లేదు సరి కదా ఆ నక్సలైట్లతో కలిసిపోతున్నారు. వాళ్లకి గుట్టూ మట్టూ అందిస్తున్నారు. ఊళ్లో వాళ్లని కట్టుదిట్టం చేయక పోతే పరిస్థితులు చేతులు జారిపోయేట్టు ఉన్నాయి. అందుకోసం సభ చేసారు. పదహారేళ్లు దాటిన మగాళ్లంతా రాత్రంతా ఊరుచుట్టూ కాపలా కాయాలని చెప్పారు. ఏ మాత్రం అలికిడి తెలిసినా ఊరు జనమంతా కత్తులూ కర్రలూ గొడ్డళ్లు బల్లేలుతో ప్రశిడెంట్ ఇంటి దగ్గరికి రావాలి. ఎదురు తిరగాలి. చంపాలి. వాళ్ల సమాచారం తెలిస్తే పోలీసులకి చెప్పాలి, దొరికితే పట్టుకుని పోలీసులకి అప్పజెప్పాలి. ఊళ్లోవాళ్లు ఎవరు రాకపోయినా



వాళ్ళకి తప్పువేస్తారు. కమ్యూనిష్టుళ్ళతో కలుస్తున్నట్టు తెలిస్తే వాళ్ళ ప్రాణాలు దక్కవు. రాత్రి చీకటి పడిందగ్గర్నించి ఊరు కాపలా ఉండాలి. అదీ పెద్ద మనుషులు చెప్పింది.

చెప్పినదంతా వినికూడా చంద్రదన్న వెళ్ళి ప్రెసిడెంట్‌ని అడిగాడు. 'రేప్పొద్దిల. ఇప్పుడు వీలుకాదు' అని పంపాడు ప్రెసిడెంట్. మళ్ళీ అడగటానికి గుండెల్లేవు చంద్రదన్నకి.

పోలీసులు తుపాకులతో గంటకీ అర గంటకీ వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు. టార్చిలైట్లు పట్టుకుని. ఊరంతా చీకటిగా ఉంది.

'మేష్టరుతో సెప్తే ఏమేనా సాయం సేయగల్డు' అన్నాడు చంద్రదన్న తళుక్కున ఆలోచనవచ్చి. చంద్రదన్నతో మేష్టరు దగ్గరికెళ్ళాడు నర్సిములు. పరిస్థితి అంతా విప్పి చెప్తే విని 'ఇంటిదగ్గర ఇప్పుడు ప్రెసిడెంట్ ఉండడుకదా ?' అని ఒకసారి చేతివాచీ చూసుకున్నాడు. 'లాభం లేదు. అయినా వెళ్ళి మాటాడండి. తొందరగా వెళ్తే దొరకొచ్చు. అ ప్రయివరే వెళ్ళి బతిమాల్తే వొప్పుకోవచ్చు' అన్నాడు.

వాలు కుర్చీమీంచి లేవలేదు సరికదా వెళ్ళినవాళ్ళని కూచోమనలేదు మేష్టరు ప్రెసిడెంట్ బంటే ఇంత నిర్లక్ష్యం చూపించాడు. ఇక ప్రెసిడెంట్ చూడనన్నా చూస్తాడా. ఏమయినా బులెట్ లాంటి సలహా ఇచ్చినందుకు ధైర్యంతో వచ్చి సిమాద్రికి చెప్పారు,

అప్పటికే పదిగంటలు దాటింది — ఊళ్ళోని తాటి కమ్మల మట్టిగోడల ఇరుకుద్వారాల ఇళ్ళన్నీ నిద్రపోతున్నయి. ఉన్న ఏడెనిమిది పెంకుటిళ్ళు కూడా నిద్రపోతున్నాయి. గ్రామం నడిబొడ్డున ఉన్న రెండు మేడల తలుపులు బిగించుకుని మంచాలమీద జాగరణ చేస్తున్నయి. అక్కడ ఉన్న మనుషులకు, పోలీసులకు కాపలా ఉన్న కుక్క కొత్త నరవాసనకి అరచింది. ముఖాలమీదికి టార్చిలైట్లు వేసి తుపాకులు సర్దుకుంటున్నారు పోలీసులు. ప్రెసిడెంట్ కంబార్లు ఎవరెవరని కేక వేసారు. ప్రెసిడెంట్ పెళ్ళాం లేచికూచుంది. ప్రెసిడెంట్ తల్లి గట్టిగా కళ్ళు మూసుకుంది. చుట్టూ ఉన్న ఇళ్ళవాళ్ళు తలుపులు దబ దబ మూసుకుని లోపల్నించి చెవులు రిక్కించి వింటూ కూచున్నారు.

నర్సిములు సిమాద్రి ఆ పరిస్థితికి తెల్లబోయారు. వాళ్ళకు ముందు ఏమీ అర్థం కాలేదు. చుట్టుముట్టిన మనుషులంతా తలో తిట్టు తిట్టి పంపించారు. అనవసరంగా అన్నితిట్లు తిన్నందుకు ప్రాణం చచ్చిపోయింది. ఉసూరుమంటూ తిరిగి లారీవద్దకు వచ్చారు.

'రాత్రేళ పెశిరెంటూ అళగా ఇళ్ళల్లో తొంగోరు' అన్నాడు చంద్రదన్న—

*      *      *


— అంత రాత్రప్పుడు ఆ ఊళ్ళో తినటానికి ఏం దొరకదు. ఆకలి — కడుపు మండిపోతున్నాది అని నర్సిములు గిల గిల తన్నుకుని గింజాకుంటున్నాడు. చూసిచూసి చంద్రదన్న 'కసింత బెల్లం తెస్తాను. కొబ్బరికాయొకటి కొట్టికొని తిను' అని వెళ్ళి బెల్లం తెచ్చిచ్చాడు.

నర్సిములు ఒక కొబ్బరిముక్కా ఇంత బెల్లమూ సిమాద్రికి ఇవ్వబోతే తీసుకోలేదు. 'నాకు ఆకలొకటి ఉందా ? కంటికి నిద్ర ఉందా? ఏమొద్దు' అని చాలా నీరసంగా అన్నాడు. ఆ గొంతు దుఃఖంతో తడిసి నాని చివికిపోయినట్టుగా ఉంది. అప్పుడు సిమాద్రి మీది భయాలన్నీ పోయాయి.

వాన వచ్చినప్పుడు టీకని నర్సిములు హోటల్లో దూరాడు. వాన తగ్గనీ ఆని ఆలస్యం చేసాడు, ఒక్క అరగంట ముందు వచ్చినా లోడింగ్ అయిపోయేది. అందరినీ పేరుపేరున తిట్టిన సిమాద్రి తన ఊసు ఎత్తకపోవడం తెలిసొచ్చి నర్సిములు మరింత నొచ్చుకున్నాడు. ఇంటి దగ్గర తిన్నాడో లేదో సిమాద్రి. మధ్య ఎక్కడా టీ అన్నా తాగలేదు. ఇప్పుడు తిండిలేదు. ఈ కొబ్బరన్నా తింటే—మళ్ళీ వెళ్ళి బతిమాలాడు నర్సిములు.

'నర్సిములూ నాకు ఆకలయితే నీవు బతిమాలాలా. నీ చేతిలోది తీసుకొని తిన్నానా గుండంతా కుమిలిపోతున్నాది. మందులు కొన్లేక డాక్టర్లకి ఫీజులు ఇచ్చుకోలేక పెళ్ళాన్ని చంపేస్తున్నాను. అది చనిపోయే వేళకన్నా దాని ఎదుటపుండి ఆ కష్టాన్ని బుగ్గి చెయ్యడానికైనా కూడా నాకు' అని ఆగిపోయి మళ్ళీ 'ఎప్పుడు తెల్లారుతుందో అని తూరపు దిక్కు చూస్తూ కూచున్నాను. నీవెళ్ళి కునుకు తియ్యి. తెల్లారక ముందు బండి లోడ్ చేయించు. ఆ చంద్రదన్నకి చెప్పు.'

ఆ మాటలు విని మారు నోరెత్తకుండా



మండపం మెట్లమీదికొచ్చి చంద్రన్నదగ్గర కూచున్నాడు నర్సిములు.

నర్సిములు బెల్లమూ కొబ్బరి తింటు న్నాడు.

'పోలీసోళ్ళు ఉన్నారుకదా ... తుపాకులు పట్టుకొని...మల్లా టూ జనాన్నంతా నమ్మనడంఎందుకూ. పోలీసోళ్ళకీ కమూనిష్టోళ్ళకీ మద్దిసపడి కాలి నచ్చిపోమా నర్సింగులూ?

చంద్రన్న గొంతు బాగా తగ్గించి గాలిలోమాత్రమే పలికి అడిగాడు.

నర్సిములు మాటాడ లేదు.

'మనకీ బాముల్నీ వంచుతారట ఇప్పుడు నర్సింగులూ' అని ఆ మాటలకి నర్సిములు ఏం చెపుతాడో కూడా వినకుండా 'కమూనిష్టోళ్లో మనమూ కలిసిపోతే' చెవిదగ్గర నోరుపెట్టి అన్నాడు.

దక్షిణ దిక్కు పిధివించి టార్చిలైట్ నడిచి వస్తున్న కాంతి కనిపించింది నర్సిములుకి. చంద్రన్నని వేలుతో పొడిచి చూపించాడు. చంద్రన్న గుర్తుపట్టాడు. ఒకరు మేస్టరు. రెండోవాడు జగ్గన్న. మేస్టరు గన్‌లాగ సన్నగా పొడుగ్గా ఉన్నాడు. జగ్గన్న లోడ్ ఎక్కించుకున్న లారీలాగ బరువుగా ఎత్తుగా ఉన్నాడు.

టార్చిలైట్ వెలుతురు ముందు లారీ మీద—తర్వాత కొబ్బరికాయల రాశిమీద—తర్వాత స్కూల్ వరండా పోలీసులమీదా తుపాకులమీదా—ఆ తర్వాత మండపం మెట్లమీద కూచున్న నర్సిములూ చంద్రన్నలమీదా—తిరుగుతూ పడింది. వాళ్లను చూడటంతోనే కూచున్నవాడల్లా లేచి నుంచున్నాడు చంద్రన్న.

'నర్సింలూ డ్రయివరేడీ డ్రయివరు???' దూరంనించే అడిగాడు మేస్టరు.

డ్రయివర్ అవసరం ఏదో వచ్చిపడి నట్టుంది.

నర్సిములు కూడా నుంచుని 'ఎందుకు?' అన్నాడు.

జగ్గన్న ఖరీదయిన మనిషిలా కనబడ్డాడు. నుదుట సగం చెరిగిన నామం. నిమ్మకాయలు నిలబెట్టటాని కన్నట్టు మీసాలు. కిల్లీ నమిలి నమిలి గారపట్టి నల్లబడ్డ పళ్ళు. తాగినవాడి కళ్ళలాగ ఎర్రబడ్డ కళ్ళు.

'అవసర మొచ్చింది. ఎక్కడున్నాడేడి ?'

'సీటోల్ల పడుకున్నాడు. ఈ డ్రయివర్ ధర్మన్న కాడు. ఈ రూట్ కి కొత్త. కోపిష్టి మనిషి—'

నర్సిములు చెప్పడం ఆపలేదు. సీటోల్ల అన్నమాట చెవిని పడటంతోనే లారీకేపు నడిచారు. మిగిలిన మాటలు విన్నట్టు లేదు.

లారీ సీటోల్లకి ఎక్కి తలుపుదగ్గరికెళ్లి 'డ్రయివరూ డ్రయివరూ' అని మేస్టరు పిలుస్తున్నాడు. తలుపుమీద ఒక చేత్తో కొట్టూ, వేరొక చేత్తో లోపల లైట్ వేస్తున్నాడు జగ్గన్న.

సిమ్మాద్రికి...ప్రాణం కొంతసేపు మనసునీ గుండెనీ వొదిలి ఎక్కడికో పారిపోయి మళ్లీ వచ్చినట్టయింది.

'ఎవరు?' గొంతు కటువుగా.

'కొంచెం పనుంది లే'

కుక్కను కసిరినట్టు కసిరాడు సిమ్మాద్రి.

అవమానమయింది. 'తాగినట్టున్నాడు' అన్నాడు మేస్టరు జగ్గన్న చెవిలో.

మళ్లీ లేపుతున్నాడు మేస్టరు. అప్పుడే అక్కడికొచ్చిన చంద్రన్న 'డయివేరు బాబా పెశిరెంటు మావ వొచ్చినాడు తెలివి తెచ్చుకుంతావా?' అన్నాడు.

చిదరించుకుంటూ లేచాడు సిమ్మాద్రి. 'ఏమయింది?' అన్నాడు.

ఆ ధోరణి మేస్టరుకుగాని జగ్గన్నకు గాని నచ్చలేదు.

'ఒకసారి సోంపేటదాకా వెళ్లి రావాలి. ప్రశిడెంట్ మరదలకి పెద్ద అపాయ మొచ్చింది' అన్నాడు గొంతు సర్దుకుని మేస్టరు.

'కుదరదు'

'కుదరక పోవడమేమిటి? ముందు దిగుతావా కిందికి?' రెచ్చిపోయి స్వాన బలం కొద్దీ మాట్లాడాడు మేస్టరు.


'కుదరదంటే కుదరదు' అని వాళ్ల మాటల్ని తీసిపారేసి మళ్లీ శరీరాన్ని సీటోల్ల వాల్చాడు.

'వాడు ధర్మన్న కాడండి. కొత్తవాడు కోపిష్టి మనిషి అంటే నామాట విన్లేదు మీరు' అన్నాడు నర్సిములు.

డ్రయివర్ పెడసరితనానికి జగ్గన్నకి కోపం మించిపోయింది. పని జరగాలి కాబట్టి తమాయించుకుని తగ్గాడు. 'డ్రయివరూ నీ కష్టముంచుకోను. పది రూపాయి లిస్తాను. నీతో ఈ మేష్టరొస్తాడు. నా మాట దక్కించు. కాదనకు. ఎల్లి డాక్టర్ని తీసికొని రాండి.'

ఆ వూళ్లోకల్లా భాగ్యవంతుడు జగ్గన్న. అంత దీనంగా బతిమాలుతుంటే కూడా సిమ్మాద్రి లెక్కచేయలేదు.

సిమ్మాద్రి చాలా సేపటినించి ఏడుస్తున్నాడు. వాడి కళ్లు క్రన్నెప్పలూ ఇంకా తడిగా ఉన్నాయి. కన్నీళ్లతో ముఖా



చెవులూ, పెరిగిన గెడ్డమూ తడిచాయి. చెవికింద పెట్టుకున్న చేయి తడిచింది.

పెళ్ళయి ఏడాదిన్నరకంటె ఎక్కువ కాలేదు. తొలి ఆర్నెలలు అదేమిటి స్వర్గమే స్వర్గం అనుభవించారు. చేతుల్లో చుట్టుకుని చూపుల్తో సుఖాలని పిలిచే నీలమ్మ. తండ్రి చనిపోతే — తల్లి మారుమనువు చేసుకుని మొగునితో — కూతుర్నొదిలేసి — కలకత్తా వెళ్ళిపోతే — తాతదగ్గర పెరిగిన నీలమ్మ క్లీనర్ నర్సిములు అంటే వయసు నించీ — లది గోచితో తిరుగుతున్నప్పటి నించీ — ఏడెనిమిదేళ్ళ నించీ చూసి — పరాచకాలాడి దెబ్బలు తిని తిట్లు తిని అవమానపడి చేసుకున్న పెళ్ళి. వయసొచ్చి నీలమ్మ సొగసులని తిర్చింది. అది సొగసు కాదు — నీలమ్మ. ఆ జ్ఞాపకాలతో ఉక్కిరి బిక్కిరిగా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపుకూడా విడుచుకోనివ్వకుండా వచ్చి వాళ్ళు ఇబ్బంది పెడుతున్నారు. ఏడుపు గొంతునీ కన్నీళ్ళ ముఖాన్నీ దాచుకుంటూ కసురుతున్నాడు సింహాద్రి.

సింహాద్రికి చెప్పినా మాట దక్కదని అంటే అంటనట్టు నుంచున్నాడు నర్సిములు. డ్యూటీలో ఉన్న పోలీసులు గొడవంతా చూస్తున్నారు.

'ఇదిగో డ్రయివరూ నా చిన్నకూతురుకు ప్రాణాపాయ మొచ్చింది, డాక్టర్ని తెచ్చావో నీకు పుణ్యముంటుంది. జన్మజన్మలకి రుణపడి వుంటాన్నీకు. పాతికరూపాయిలిస్తాను. నీ కష్టముంచుకోను. ఒక మనిషి ప్రాణం కాపాడు. నీకు పుణ్యముంటుంది. నా మాట కాదనకు ?

అడుక్కుంటున్న వాడిలాగ జగన్న డ్రయివర్ని బతిమాలుతుంటే చంద్రన్న గుండె కరిగిపోయింది.

'పాతిక్కాదు పాతిక వేలిచ్చినా కుదరదు' అని ఖండితంగా చెప్పాడు సింహాద్రి.

నస్పెక్టర్లు వచ్చే వేళవుతున్నదని ఒక వేపు గుండె పీకుతున్నది జగన్నకి. మరొక వైపు కూతురు ప్రాణం పోతుందేమోనని బాధగా ఉంది. ఆ భయాల మధ్య బాధలమధ్య నలిగిపోతున్నాడు. తొందరగా డ్రయివర్ని పంపాలి. అక్కడ తొందరగా వెళ్ళటానికి ఆ లారీ తప్ప ఇంకో మార్గం ఏమీ లేదు. మళ్ళీ బతిమాలుతున్నాడు.

'ముఖంమీద టార్చిలైట్ కొట్టారెందుకు ముందది తీయండి'

మళ్ళీ కసిరాడు సింహాద్రి.

నా పెళ్ళాం చస్తున్నాది మొర్రోఅంటే బండి లోడ్ చేయించుకోనివ్వరా. నన్ను వెళ్ళనివ్వరా. మీకు కష్టాలున్నాయి. మీకు కూతుళ్ళమీద ప్రేమున్నాది. మీకు డబ్బున్నాది. ఆ డబ్బుతో మీ కూతుళ్ళకు డాక్టర్ని కొనగలుగుతారు. పెళ్ళాన్ని బతికించుకోగల ఆశ లేదు నాకు. చివరికి చచ్చిపోయేముందు దాని కళ్ళచూపు చూడటానిక్కూడా భాగ్యం లేకపోయింది. నీ కూతురు చావనీరా. నీవూ చావు. ఏడిచి ఏడిచి కుళ్ళి చావు. నేను చావటం లేదు కుళ్ళి కుళ్ళి నా గుండెలు కోతపెట్టడం లేదూ. నా పెళ్ళాం నాకు సుఖమివ్వలేదూ: నా పెళ్ళాం నన్ను ప్రేమించలేదూ, ఎవరి ప్రేమ వాళ్ళదే ఎవరి కష్టాలు వాళ్ళకే. ... కొడకా ఇక్కడుండొద్దు పో. అని లోపల్లోపల కసికొద్దీ పళ్ళుకొరికి అంటున్నాడు సింహాద్రి.

'పెద్ద మనిషొచ్చి మాటాడుతున్నాడు. ముందు కిందికిదిగి మాటాడు డ్రయివరూ'.

లుంగీ కట్టుకుని బనీనుతో వచ్చాడు మేస్టరు రెయిన్‌షూ ఉంది కాళ్ళకి. చేతికి గడియారం. నమ్మిన బంటుగా మాటతో సాధ్యమయినంతవరకు సాధించాలనుకుంటున్నాడు.

'డ్రయివరూ జగన్నగారంటే ఎవరో నీకు తెలిసినట్టులేదు. కొత్తగా వచ్చావు లెందుకు. మీ ప్రొప్రయిటర్‌గారూ జగ్గయ్య గారూ నేస్తాలు. ఆయన ఇటొస్తే జగన్నగారింట్లో ఉంటారు. జగన్నగారు


ఆల్బో-సాంగ్

అన్ని వయసుల
వారికి ఆదర్శక బలవర్థకం

మీరు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-సాంగ్ అవసరం. వృద్ధులకు, యువకులకు కూడా పటిష్ఠమైన శరీరాన్ని ఆరోగ్యాన్ని పెంపొందించుటకు ప్రత్యేకమైన పదార్థాలు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి. ఈ రోజు ప్రతి రోజూ కూడా ఆల్బో-సాంగ్ తీసుకోండి. సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు.






జె. అండ్ జె. డీషేన్
హైదరాబాదు (దక్కన్).

శ్రీకాకుళం వెళితే మీ ప్రొప్రయిటర్ ఇంట్లో ఉంటారు. మీ ప్రొప్రయిటర్ మర్యాదన్నా కాపాడు. చివరిమాట చెప్తున్నాను. ముందు దిగు. మనిషిని చూసి మాటాడు. ఎవడో దిక్కులేని వెధవ నీదగ్గరికి రాలేదు. కొంచెం ఆలోచించి మంచీ చెడ్డా చిన్నా పెద్దా చూడు' అన్నాడు మేష్టరు.

సింహాద్రి నోరు విప్పలేదు.

మళ్లీ మేష్టరు 'జగ్గన్నగారు ఉపకారం చేసే మనిషి. ధర్మన్ననే అడుగు తెలుస్తుంది.' మంచితనాన్ని కొనియాడాడు.

అందరూ ఉపకారం మనుషులే. ఆసుపత్రిలో డాక్టరు కాళ్లా వేళ్లా పడి బతిమాలితే 'ఇంక లాభంలేదు. మందులేవీ పనిచేయవు. ఒకటి రెండు దినాల మనిషి. నేను దేవుణ్ణి కాను. రోగం ముదిరిపోయింది. ఏం చేయలేము. చేయి జారిపోయింది తీసుకుని వెళ్లిపో' అని ఆగకుండా వెళ్లిపోయాడు. బెడ్‌మీది రోగిని డిస్చార్జి చేసి బలవంతాన పంపించేసాడు. నా మొర ఎవరు విన్నారు ఎవరు నా కష్టాలు చూసారు. అంతా ఉపకారం మనుషులే. కోపంతో మండిపోతున్నాడు సింహాద్రి.

జగ్గన్నకి తొందరగా ఉంది. నక్సలైట్లు నోటీసువచ్చిన మొదట్లో లెక్కచెయ్యలేదు. కాని వరసగా ఆరేడుగురు భూస్వాముల్ని చంపేసారు. తలలు చెట్లకు వేలాడగట్టారు. నెత్తురు బకెట్లలో పట్టి చేతిముద్రలు గోడలమీద వేసి నినాదాలు రాసారు. ఆ వూరికు ఐదారుమైళ్లలో ఇద్దరు భూస్వాములను చంపేసారు. దాంతో జగ్గన్న ఇప్పుడు రాత్రిపూట ఊళ్లో నిద్రపోవటం లేదు. ఆవులమందల మధ్యనో గొర్రెల మందల మధ్యనో రోజుకొకచోట జాగరణ చేస్తున్నాడు.

సామాన్యంగా పన్నెండు గంటల సమయంలో ఊరు చుట్టుముట్టేస్తారు నక్సలైట్లు. ఒకరా ఇద్దరా వెయ్యిమంది దాకా ఉంటున్నారు. బాంబులు విసురుతారు. మైకుల్లో ఇల్లు కదలొద్దని హెచ్చరిక చేస్తారు. ఈ పోలీసుల్ని చూస్తుంటే నక్సలైట్లతో వీళ్లు కుమ్మక్కయినట్టుంది. ఇన్ని వేలమంది వచ్చి తాలూకాల్లో ఉన్నా హత్యలు చేసి పారిపోతున్నారు నక్సలైట్లు.

'డ్రయివరూ నీవే నా కూతురుకిప్పుడు ప్రాణం పోయగలవు. ఇంక నాకు ఏ ఆశా కనబడదు. ఒక ప్రాణాన్ని కాపాడమని బతిమాలుతున్నాను. డాక్టర్ని వెళ్లి తీసుకురాండి. నేను ఏం ఉపకారం చేస్తానో నీకే తెలుస్తుంది. నా మాట నమ్ము' అని చివరిసారిగా జగ్గన్న ప్రాధేయపడి కోరాడు.

డాక్టర్లంటేనే అసహ్యం సింహాద్రికి. ఐదోనెల గర్భం పోయింది నీలమ్మకి. ముందు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు. తగ్గినట్టు కనిపించ లేదు. తర్వాత ప్రవేట్ డాక్టర్ల దగ్గరికి తీసుకెళ్లాడు. తగ్గలేదు. చెప్పిన మందులన్నీ కొన్నాడు. డాక్టర్లకు ఏం తక్కువ చేస్తే ఎక్కడ అశ్రద్ధ చూపుతారోనని అడిగినంత ఫీజు చెల్లించుకున్నాడు. పెద్దాసుపత్రికి విశాఖపట్నం తీసుకెళ్లాడు. అంచాలకింద డబ్బు ఖర్చయిందే కాని రోగం నయం కాలేదు. నీలమ్మ నెత్తురంతా చీము పోయింది. నీలమ్మ ఎముకల గూడయిపోయింది. లాభంలేదని డిస్చార్జి చేసి పంపించేసాడు డాక్టరు. రోజా చచ్చిపోతుందని — పదిహేను దినాలు గడిచాయి. డబ్బుకు లోభపడకుండా ముందే మంచి డాక్టర్లకు చూపించుంటే నీలమ్మ బతికేది. డబ్బు కక్కుర్తిపడి నీలమ్మని చంపేసి—రేపు వెళ్లేసరికి నీలమ్మ బతికుంటుందా.

'డాక్టర్ని తీసుకొచ్చి నా కూతురు ప్రాణం కాపాడు డ్రయివరూ' అంటున్నాడు జగ్గన్న.

'బాబూ నన్నొదలండి. చంపకండి నా దుఃఖంలో నేను మునిగున్నాను. మీకు వెయ్యిదండాలు పెడతాను వెళ్లండి. ఆ మేనేజర్ ... కొడుకు చేసాడు ఇదంతా' అని మళ్లీ గొంతు కఠినం చేసాడు సింహాద్రి.

* * *

గోడౌన్స్ దగ్గర బండిని ఆపి కిందికి దిగాడు సింహాద్రి. చెప్పులమేకులు పాదాలకు గుచ్చుకుంటున్నాయి. నొప్పిగా ఉంది.

కళాసీలు వచ్చారు బండి దగ్గరికి. నర్సిములు అక్కడ ఉన్నాడు.

తిన్నగా సింహాద్రి ఆఫీస్ వేపు నడిచాడు.

ఉదయం ఆ ఊళ్లో మేష్టరు జగ్గన్న ప్రెసిడెంటు ఇంకా కొందరు పెద్దమనుషులు పిలిపించారు. జగ్గన్న కూతురు చచ్చిపోయింది. తిట్టారు. తన్నబోయారు. మేష్టరు ముఖాన ఉమ్మేడు. ఎముకలు విరగ్గొట్టేవాళ్లే. నర్సిములు అడ్డుపడి నీలమ్మ చావుబతుకుల మీదున్న సంగతి చెప్పకపోతే — కుళ్లబొడిచేవాళ్లే. నర్సిములు చెప్పిన మాటకూడా నమ్మలేదు మేష్టరు ఎత్తు ఎత్తినాడన్నాడు. వాడితో రాత్రి నర్సిములు చెప్పినసంగతి వినికూడా అలా మాటాడాడు. అనరాని మాటలన్నారు. తల తీసేసినట్టయింది. 'డ్రయివరూ ఆ పిల్లప్రాణం నీ మూలంగానే పోయింది. నీవే తినేసావు బంగారంలాంటి పిల్లని. ఆ పాపం చుట్టుకోకుండా ఉండదు. అందుకే నీ బతుకు ఇలాఉంది' అన్నాడు. ఆ మాటలు చెవుల్లో మళ్లీ మళ్లీ గింగురుమంటున్నాయి. ఆ పిల్ల చచ్చిపోవటానికి అక్కడ ఇరుగు పొరుగూ తల్లీ తండ్రీ ఎవరూ కాదు కారణం. డాటీమీద వెళ్లి ఆ రాత్రి అక్కడ చిక్కడిపోయిన తను కారణమట. అక్కడున్న అందరూ ఆ మాట అన్నారు.

నీలమ్మ...

ఆఫీస్‌లో మానేజరూ గుమస్తా టైపిస్టూ ముగ్గురే. ఎవళ్లపనుల్లో వాళ్లు తీరిక లేకుండా ఉన్నారు. మానేజర్ దగ్గరకు వెళ్లి నుంచున్నాడు

'ఇప్పుడే అరగంటకిందట రామ్మూర్తి వొచ్చి కూచున్నాడు ఇచ్చి పంపించినాను. ఇక్కడ సంతకం చెయ్' అని రెవెన్యూ స్టాంప్ అతికించిన రిజిష్టరు తన దిక్కు పెట్టాడు.

సింహాద్రి నెలజీతం అరవై రూపాయిలు. మెడికల్ షాప్ ప్రొప్రయిటర్ రామూర్తి వచ్చి ఆ అరవై రూపాయిలూ నెలనెలా తీసుకుపోతాడు ఇంకా అయిదు వందలకు పైగా చెల్లించాలని లెక్క చెపుతున్నాడు ఆ షాప్‌లో రేట్లు రెట్టింపు ఉంటాయని తెలిసికూడా క్రెడిట్ ఇచ్చేవాళ్లులేక మానేజర్ని బతిమాలుకుంటే పూచీపడి ఇప్పించాడు

మానేజర్ బత్తా ఇస్తాడని చూస్తున్నాడు.

టైపిస్టు టక టక కొడుతున్నాడు.

గుమస్తా పదిరూపాయల నోట్లు లెక్క పెట్టి కట్టలు కట్టుతున్నాడు పైన సీలింగ్ ఫేన్ తిరుగుతున్నది. స్టేట్‌బేంకు వాళ్ల కలర్‌ఫోటోల కేలండరు ఆగస్టు నెలతో గోడకి. చందమామ లాంటి గోడ గడియారం పదకుండు గంటల చూపు. అల్సేషియన్ కుక్క ఆఫీస్ నించి బయటికి బయటి నించి ఆఫీస్‌కే వచ్చేపోయే మను షుల వాసన పసికట్టుతున్నది. తిరుపతి వెంక టేశ్వరుల పటానికి పూలహారం వేలాడు తున్నది. కిటిలోంచి గోడౌన్స్ దగ్గరి ముదురాకు పచ్చరంగు లారీ కనిపిస్తున్నది. కళాసీలు కొబ్బరికాయలు అన్‌లోడ్ చేస్తు న్నారు.

రూపాయినోట్లు రెండుతీసి సిమ్హాద్రి చేతిలో పెట్టాడు మానేజరు. బత్తా అయిదురూపాయిలకి తనదగ్గర సిమ్హాద్రి తీసుకున్న అప్పుకింద మానేజరు రోజూ మూడు రూపాయిలు కోసుకుంటాడు. ఇచ్చిన ఆ రెండు రూపాయిలూ పట్టుకుని బయట పడ్డాడు సిమ్హాద్రి.

సుబ్బన్న...హనుమంతయ్య...సాంబడు... గోపాలరావు...రెడ్డి...వీళ్లంతా కలుస్తారు. కాని అప్పు తీర్చమని అడగరు. అడగక పోయినా వాళ్లని చూస్తుంటేనే భయ మేస్తుంది. వాళ్లకు సిమ్హాద్రి కష్టాల్లో ఉన్నాడని తెలుసు, అందుచేత అడగరు. ఇచ్చేస్తానని సిమ్హాద్రి ఇవ్వలేకపోతున్నాడు.

మధ్యన కిరాణాషాప్ కలుస్తుంది. ఆ సావుకారును తప్పించుకోవాలి. అంచేత మరో వీధిలోంచి పోవాలి.

వర్షానికి రోడ్డంతా బురదగా ఉంది. రోడ్డుమీద బస్సులు లారీలు కార్లు రిక్షాలు సైకిళ్లు నల్లటి తలకాయలు రంగు రంగుల గుడ్డల పుష్పాలు, మురికిమీద చేరిన ఈగల్లాగ జుమ్మంటూ.

తిన్నగా ఇంటికి వెళ్ళాడు ఆ ఇంటి ముందు చాలా ఏళ్ళక్రితం ఓ మట్టిగోడల్లు కూలిపోయి పుట్టలు పుట్టలుగా పడుంది. ఆ స్థలమంతా జిల్లేడు, తంగేడు, ఉమ్మెత్త ఇంకా గడ్డి పిచ్చి పిచ్చి పొదలు దట్టంగా పెరిగాయి. వాటి మధ్యనించి సన్నటి దారి. ఆ ఇల్లు బాగా లోపలికి ఉంది. ఆ ఇంటికి ఒకపక్క డాక్టరుగారి కొత్త డాబా—రెండోపక్క లాడ్జింగ్ ప్రొపయి టర్‌గారి మేడ. ఆ పక్కన సాంఘిక సంక్షేమ కార్యాలయం. ఆ మిగిలిన ఇళ్లన్నీ రోడ్డుకు ఆనుకునే ఉన్నాయి. ఆ ఇళ్లకి ఎదురు వాసలో అడ్వొకేట్‌గారి ఆఫీసు. బ్రాంచి పోస్టాఫీసు ప్రిటింగ్ ప్రెస్సు స్టుడియో వసరగా ఉన్నాయి.

సిమ్హాద్రి ఇంటిలోపల అడుగు పెట్టే సరికి ఒక ముసలి తల్లికుక్క ఓ ప్రక్క పడుకుని ఉంది. నీలమ్మ చచ్చిపోయి ఉందో ఇంకా నాడి ఆడుతున్నదో ముందు తెలీ లేదు, ఆ పక్కంతా కంపు కంపుగా ఉంది. తడితడిగా ఉంది. పక్కగుడ్డలన్నీ ఎటువటు చెదిరిపడి ఉన్నాయి. నీలమ్మ వొంటిమీది చీరజారిపోయి ఉంది. మొలమీద కట్టులేదు. నడుమూ పొట్టా బయిటికి కనిపిస్తు న్నాయి నీలమ్మ పెద్దజుత్తు విరేచనాల్లో పడి, ఎండిపోయి బంక బంకగా ఉంది. అక్కడ ఈగలు ముసురుతున్నాయి. నోటి మీదా కళ్లమీదా ముక్కుమీదా వాలి కొరుకు తున్నాయి. నోరు తెరచుకుని పళ్లు కని పిస్తున్నాయి.

నీలమ్మదగ్గర కూచున్నాడు. కళ్ల లోకి చూసాడు. ఆ కళ్లకి ఇంకా చూపు అంటుకుని ఉంది. కళ్లల్లో తడి ఉంది. చేయి చూసాడు. ఆ చేతికి కదలిక ఉంది. పెదాలు చూసాడు. అవి కదులుతున్నట్టు కనిపించాయి.

నీలమ్మా అని రెండు చేతుల్తోనూ ఆమె ముఖాన్ని పట్టుకున్నాడు.

ఆ చేతులు అలాగే ఉన్నాయి. చల్లగా నీలమ్మ కళ్లచూపు రాలిపోయింది.

ఆ ఇంటిగోడలు పెచ్చు లూడుతున్నాయి. పైకప్పుమీద ఎలకలు — వాటిని తిన టానికి పాములు తిరుగుతున్నాయి. ఇంటి నేలంతా చెమ్మపట్టి ఉంది. ఇంకా ఇంకా ఆ ఇంటినిండా రకరకాల పురుగులు. ఎప్పుడూ కుళ్లిపోతున్న వాసన ఏదో ఉంటుందక్కడ.

జగ్గన్నకూతురు గుర్తొచ్చింది. తన మూలంగా ఆ పిల్ల చచ్చిపోతే — తనే ఆ పిల్లను చంపేస్తే—ఆ పిల్లని తను తినేస్తే —తన పెళ్లాన్ని ... నీలమ్మని ... ఎవరు ఎవరు తినేసినట్టు. ఎవర్ని నిందించాలి. ఎవర్ని ఎందర్ని...

ఆ ఇంటికి చుట్టూ డాక్టరగారి డాబా, లాడ్జింగ్ హౌస్ ప్రొప్రయిటర్‌గారి మేడ. ఆ పక్కన సాంఘిక సంక్షేమ కార్యా లయం. ఎదురువాసలో బ్రాంచి పోస్టా ఫీసు. ప్రింటింగ్ ప్రెస్సు అడ్వకేట్‌గారి ఆఫీసు. ఫొటోస్టుడియో. వాటి మధ్య నున్న సిమ్హాద్రి ఇంట్లోంచి లేచిన పెద్ద ఏడుపు ఎవరికీ వినిపించలేదు.

ఆ ఏడుపుకు భయపడి కుక్కమాత్రం లేచి పారిపోయింది. ●

